
పెద్ద కథ



# అంధకారంలో ఆశాకిరణం



బద్దెపూడి సుధారాణి

(గతసంచిక తరువాయి)

అంతలో లక్ష్మీపతిగారి ఫ్యామిలీ డాక్టర్ ప్రసాద్ వచ్చారు. ఆయనచేత బర్త్‌డే కేక్ కోయించారు. ఆవాళ ఎంతో సందడిగా, సంతోషంగా శశి పుట్టిన రోజు జరిగింది.

మర్నాడు అరుణ అన్నగారు ఢిల్లీనుంచి వచ్చారు. అతని పేరు రవీంద్ర. ఇంజనీరు. చెల్లెల్ని చూసేందుకు వచ్చాడు.

గుణం ఎలాంటిదోగాని, చెల్లెలిఅందంతో సమానంగానే వున్నాడనుకుంది లత. రవీంద్ర రాకతో, అరుణ మరింత సంతోషంగావుంది.

రవీంద్ర అందర్నీ పలకరించాక, లతని చూస్తూ, "ఈమె ఎవరూ?" అరుణని అడిగాడు

"సరే, నీ కళ్ళూ ఆమెమీదే పడ్డాయన్నమాట. అది ఎవరో మహాతల్లి పెద్ద కథానాయకురాలే! లేకపోతే యింట్లో అందర్నీ గుప్పిట్లో పెట్టుకుని ఆడిస్తుందా? ఎవర్ని అడిగినా ఈ ఇంట్లో దాని వివరాలే చెప్పరు" అంది అరుణ, రాజాని వాలుచూపులు చూస్తూ.

రాజా బాధగా ముఖం దించుకున్నాడు. "లత"ని అరుణ అట్లా అన్నందుకు రాజాని చూడమన్నట్లు కనుసైగ చేసింది అన్నగారికి అరుణ.

రాజాకి ఆ సంభాషణ పొడిగించటం యిష్టంలేక "చెస్ ఆడదామా?" అని అడిగాడు రవిని.

"నో.. నో ఆడి, ఆడి, బోర్ కొడ్తున్నది. "మోతీ"లో మంచి పిక్చర్ వుంది వెళదాము రవీ" అన్నది అరుణ

"నీవూ రావా? రాజా! మాతో" అడిగాడు రవీంద్ర.

"సారీ! ఈ రోజు తలనొప్పిగా వుంది రాలేను" అంటూ తప్పించుకున్నాడు రాజా.

ఆ రాత్రి సినిమానుంచి వచ్చాక రవీంద్రా, అరుణలు, రాజాతో మాట్లాడలేదు. బహుశా అరుణ అన్నగారితో ఏదో చెప్పిందని అనుమానించాడు.

వాళ్ళు తమ గదుల్లోకి వెళ్ళిపోయాక, నిద్రపట్టని రాజా, చదవటానికి నవల తీయబోతుండగా, టక, టకా "స్లిప్పర్స్" శబ్దమైంది. మేడమీదనుంచిఎవరోదిగుతున్నారు. రాజా ఆశ్చర్యంగా కిటికీలోంచి చూచాడు. ఎవరా? అనుకుంటూ. రవీంద్ర చుట్టూ చూస్తూ గబగబా దిగి వెళ్ళిపోతున్నాడు. రాజాకి ఎందుకో అనుమానం వేసి అనుసరించాడు. రవీంద్ర తోటలోకి వెళ్ళాడు. ఆశ్చర్యం అక్కడ లత ఒంటరిగా కూర్చుని వుంది. రాజా గెస్ట్‌హౌస్ పక్కగా నిలబడిపోయాడు. వాళ్ళ దృష్టిలో పడకుండా జాగ్రత్త పడ్డాడు.

ఇదేమి గమనించని రవీంద్ర, లతని పలకరించాడు.

"ఓ... నిద్ర పట్టక యిక్కడ కూర్చున్నావా? లేక రాజాని కలుసుకోటానికి కూర్చున్నావా?" హేళనగా అన్నాడు రవీంద్ర.

ఆ మాటలకి ఉలిక్కిపడి లేచి నుంచుంది లత, భయంగా చూస్తూ.

"మిస్ లతా! అరుణ నాకు అంతా చెప్పింది. పాపం నిన్ను చూస్తే జాలేస్తున్నది. కానీ నీ చూపుల గాలంలో రాజాని చిక్కించుకోకు. రాజా వట్టి అమాయకుడు. రాజాని పాడు చేయకు రాజాకి అరుణ ఏనాడో నిర్ణయమై పోయింది అతడి మీద నీవు ఎలాంటి ఆశలు పెట్టుకున్నా అవి అడియాసలే అవుతాయి. అరుణకి అడ్డురాకు నీకు డబ్బు కావాలంటే నేను యిస్తాను. డబ్బు కోసం మనుష్యులతో చెలగాటమాడకు జాగ్రత్త అంటూ, వడి, వడిగా వెళ్ళిపోయాడు, రవీంద్ర అతడి మాటలు తలుచుకుంటూ, కుమిలి, కుమిలి, ఏడుస్తున్న లతని చూసి రాజాకి బాధ కలిగింది.

"ఏ పాపము ఎరగని లతమీద ఎన్ని అభాండాలు" అనుకున్నాడు రాజా. తను లతకి ఎదురు పడక తప్పదనుకున్నాడు. అతడి రాకతో, లత గబుక్కున లేచి వెళ్ళబోయింది. చటుక్కున రాజా, ఆమె చెయ్యి పట్టుకుని ఆపేశాడు.

"చినబాబూ! మీకు దణ్ణం పెడతాను. నాచెయ్యి వదలండి." అంది తన చేతిని, విడిపించుకుంటూ, రాజా బలమైన చేతులు మరింత బిగుసుకున్నాయి.

"లతా నేను అంతావిన్నాను. ఆ మూర్ఖుడి మాటలు నమ్మకు. నామీద వున్న మోజు కొద్దీ అరుణ అలా చెప్పిస్తున్నది. నా మాట నమ్ము అరుణ లాంటి ఆడదంటే నాకు గిట్టదు. మా ఇద్దరి మనస్సులు కలవ్వు, నాకు ఆమె అంటే ఎప్పుడూ ఇష్టంలేదు. నా హృదయంలో చోటు చేసుకున్నది నీవే లతా! నా మనస్సు ఏనాడో దోచుకున్నావు. నా మాట నమ్ము." అంటూ లత చేతిని ఆప్యాయంగా నొక్కి వదిలేశాడు.

"చిన బాబూ! ఈ సంగతి పెదబాబుగారికీ, మీ అమ్మగారికీ తెలిసిందంటే ఈ ఇంట్లో నిలవ నీడ వుండదు నాకు. నేను దిక్కులేని దాన్ని, మీకు పుణ్యముంటుంది నన్ను యిలా బ్రతకనివ్వండి. మీ హృదయంలో చోటు సంపాదించుకునే అర్హత నాకేముంది బాబూ! అంటూ కన్నీరు కారుస్తూ ముఖం తిప్పేసుకుంది.

"లతా! అనవసరంగా బాధపడకు. ఈ ఇంట్లో ఎవరూ నా మాట కాదనరు నా నిర్ణయానికి తిరుగులేదు. లతా! నా మాటనమ్ము నేను నీకు ఎలాంటి ద్రోహం చేయను. ఏ ఆపదారానీయను. కాని నీవు, అరుణకీ రవీంద్రకీ దూరంగా, వుండటానికి ప్రయత్నించు" చివరిమాటగా చెప్పాడు రాజా.

"చినబాబు! మీరు ఏదో అనుకుంటున్నారు. అనుకున్నంత తేలిక ఏదీకాదు." అంటూ గబ గబా వెళ్ళిపోయింది లత.

* * *

ఆ రోజు రాజా తోటలో కూర్చుని గిటార్ వాయించుకుంటున్నాడు. అరుణ వచ్చింది.

"రాజా! పిక్చర్‌కి వెళదాము రావూ" అడిగిందామె.

లుంగీ, దానిమీద పూల పూల షర్ట్. బుజాలమీద పడుతున్న జుట్టు. పెదవులకి ఎర్రనిరంగుతో వున్న అరుణనిచూచి ముఖం తిప్పేసుకున్నాడు రాజా, చిరాగ్గా.

"సారీ, నేను రాలేను అరుణా! నీవూ, రవీ వెళ్ళండి నా ఫ్రెండ్ ఒకడు యివాళ వస్తున్నట్లు ఫోన్ చేశాడు. అతన్ని డిసప్పాయింట్ చేయటం బావుండదు.

"ఫ్రెండ్ వస్తున్నాడా? ఎక్కడికైనా వెళ్ళటానికి లత వస్తున్నదా?" అడిగింది అరుణ ఎగతాళిగా.

రాజాకి ఒళ్ళు మండిపోయింది.

"అరుణా! నా స్వవిషయాల్లో జోక్యం కలిగించుకోకు. లత .... లత అంటూ పదే, పదే ఆ అమాయకురాలి పేరు ఎత్తకు. లత అంటే ఎందుకు నీకు అంత కోపం!" అన్నాడు రాజా ఆవేశంగా.

"ఓ. చాలావరకు వచ్చిందే! లత అమాయకురాలా? ఉఁ.... అర్థమైంది." అంటూ విసురుగా వెళ్ళిపోయింది అరుణ.

మనస్సులేని మనిషి అనుకున్నాడు రాజా కోపంగా.

నిజంగానే మర్నాడు రాజా స్నేహితుడు ఒకడు ఆగ్రా నుంచి వస్తున్నట్లు టెలిగ్రాం యిచ్చాడు.

రాజా ఆ స్నేహితుణ్ణి రిసీవ్ చేసుకో



టానికి ప్రయాణమవుతుండగా. సావిత్రమ్మ కాఫీ తీసుకువచ్చింది.

"అదేమిటమ్మా నీవు తెచ్చావు? లత ఏమైంది" అడిగాడు రాజా.

"లతకి జ్వరం. మూసిన కన్ను తెరవకుండా పడుకుంది. పాపం."

ఆ మాటతో రాజా మనస్సు అదోలా అయిపోయింది.

"పాపం లతకి ఎన్ని బాధలు" అనుకున్నాడు.

"బావకి కాఫీ యిచ్చిరామ్మా అంటే... నేనేం దాసీదాన్నా కాఫీలు చేరెయ్యటానికి, నా కేమంత ఖర్మ పట్టింది అని విసుక్కుంది బాబూ అరుణ."

"ఏదోలే చిన్నపిల్ల. తెలిసీ తెలియక అంటుందిలే అనుకుని నేనే వచ్చాను." అంటూ సావిత్రమ్మ ఏదేదో చెబుతున్నా, రాజా మనస్సంతా లతని గురించే ఆలోచిస్తున్నది

"అమ్మా! డాక్టర్‌కి ఫోన్ చేయనా!" రాజా ఆత్రంగా అడిగాడు

"ఈ కొంచం జ్వరానికే డాక్టర్లు ఎందుకులేమ్మా" అంటోంది లత.

"ఆమె అలా అంటున్నదని వూరుకుంటే ఎలా?" అంటూ రాజా వెంటనే డాక్టర్‌కి "ఫోన్" చేసి లతని చూడటానికి వెళ్ళాడు.

లత మూసినకళ్ళుతెరవకుండా పడి వుంది. లతని చూచి తిరిగి వస్తున్న రాజాని చూచి ఎగతాళిగా నవ్వింది అరుణ. రాజా విసురుగా వెళ్ళిపోయాడు.

"వస్తానన్న ఫ్రెండ్ ఆ రోజు రాలేదు. లత అనారోగ్యం బాగుండక బాగా చికాకు పరిచింది. ఎలాగో ఇల్లు చేరాడు సావిత్రమ్మ ఎదురై చెప్పింది.

"డాక్టరు రాలేదు బాబు! ఎందుకనో, ఏమో, కర్మ"

"గుడ్ గాడ్ పది నిమిషాల్లో వస్తానన్నాడుగా" ఎందుకు రాలేదూ, అంటూ, మళ్ళీ "ఫోన్" ఎత్తాడు రాజా.

"హల్లో డాక్టర్: రాజేంద్ర స్పీకింగ్, మీరు రాని కారణం తెలుసుకోవచ్చా?

"జ్వరం తగ్గిపోయింది. రానక్కర్లేదు అని చెప్పారే?"

డాక్టరు చెబుతున్న మాటలకి రాజా తల తిరిగి పోయింది.

వెంటనే డాక్టర్‌ని రమ్మంటూ "ఫోన్" పెట్టేశాడు. ఆలోచిస్తూ.

ఓహో! డాక్టర్‌ని రావద్దని "ఫోన్" చేసిం దెవరా? అని ఆలోచిస్తున్నావా? నేనే....దాసీలకి కూడా డాక్టర్లు కావాలా? పని చేయటానికి ఒళ్ళు మత్తెక్కి ఆడే నాటకాలు యివన్నీ. నీవు యిచ్చిన అలుసే ఇదంతా". అరుణ కోపంగా, కసిగా అన్నది.

రాజాకి అరికాలి మంట నెత్తికెక్కింది.

ఛీ.... ఎంత చదువుకుంటేనేం? సంస్కారం లేదు, ఇదో రకం మృగం అనుకుంటూ, వెళ్ళిపోయాడు రాజా.

డాక్టర్ వచ్చి ఇంజక్షన్ చేసి వెళ్ళాక, కొంత కోలుకుంది లత. రాజా మనస్సూ కొంత తేలిక పడింది.

మర్నాడు కాఫీ అందిస్తూ అంది లత, రాజాతో

"చినబాబూ, నా గురించి అనవసరంగా శ్రమ పడ్డారు.

"శ్రమ ఎవరికి? నీకా? నాకా?" నవ్వుతూ అన్నాడు రాజా.

లత కళ్ళల్లోకి చూస్తూ.

లత మారు మాట్లాడకుండా తలవంచుకొని వెళ్ళిపోయింది.

* * *

"అన్నయ్యా! అరుణచూడు. నా బొమ్మ ఎలా విరగ్గొట్టిందో, ఈ బొమ్మ అచ్చం లత లాగా వుందన్నాను. చూసియిస్తానని తీసుకొని విసిరిగొట్టింది. శశి ఏడుస్తూ చెప్పింది.

"ఆ అరుణ దగ్గరకు యింక వెళ్ళకు శశి, అన్ని బొమ్మలు, అలాగే పాడు చేస్తుంది." అంటూ ఆ విరిగిన బొమ్మని బాధగా చూశాడు.

"అన్నయ్యా! అరుణకి లత అంటే ఎందుకు అంతకోపం? శశికి అర్థంకాక అడిగింది.

"మంచివాళ్ళంటే అందరికీ కోపమే నమ్మా! నీవు అరుణ దగ్గరకు వెళ్ళకు!" రాజా ఏదో ఆలోచిస్తూ అన్నాడు.

"అన్నయ్యా! పాపం లత ఏమి అనకపోయినా ఆమెని అరుణ వూరికే తిడ్తుంది ఎందుకు?"

"లతని చూస్తే ఈర్ష్య అమ్మా!"

"ఓ....అయితే తెలిసింది! మా టీచర్ యివాళ ఒక కథ చెప్పారు. గంగా, గౌరీకథ గంగా. గౌరీ. ఎప్పుడూ తగువులాడుకుంటారట అందుకే శివుడు గంగని నెత్తిమీదా, గౌరీని తనలో సగ భాగంగా వుంచుకున్నాడుట. అట్లాగే మన అరుణ గంగ, లత గౌరీను. మరి శివుడు ఎవరూ?" ఆలోచిస్తూ అడిగింది శశి.

"ఏమో మరి నీవే చెప్పాలి." రాజా

మీకు సంతానం లేదా?



ఆపరేషన్ యితర వైద్యవిధానముల చికిత్సలచే నిరాశ చెందిన సోదరీమణులు, మా సలహా సంప్రదింపులచే. దేశములో పలు ప్రాంతముల స్త్రీలు సంతానవతులై పంపిన ప్రశంసాపత్రము లనేకము గలవు.

ఉచిత సలహా. వివరములకు ...

శ్రీ నాగార్జున మూలికా కుటీరం

రైల్వేస్టేషన్ వద్ద !! రామాలయం వీధి,

తెనాలి - 2.

నవ్వుతూ అన్నాడు.

"నీవే శిపుడివి." శశి కొంటెగానవ్వుతూ అన్నది.

"అమ్మ దొంగా! ఎన్ని మాటలు నేర్చావు" అంటూ శశిని పట్టుకోబోతుండగా శశి పరుగెత్తింది. తనూ పరుగెత్తాడు.

ఎదురుగా లత రావటం..గమనించ లేదు రాజా, అతడి నుదురు, ఆమె నుదురుకి తగిలింది. అబ్బా! అంటూ నుదురు పట్టుకుంది లత.

"అయ్యో! లతా నీవా? బాగా దెబ్బ తగిలిందా" అంటూ ఆమె నుదురును పట్టుకొని చూస్తుండగా అరుణ వచ్చింది.

"ఆకలిగా వుంది మిక్సీ రెడీ చెయ్యమంటె నీవు చేస్తున్న నిర్వాహం యిదా" అంది. కోపంగా అరుణ.

లత గబా గబా వెళ్ళిపోయింది భయపడుతూ.

రాజా అసహ్యంగా చూచాడుఅరుణ వేపు. అరుణ కసిగాచూచింది. రాజావేపు.

"ఏయ్ అరుణా? లత అంటే ఎందుకమ్మా నీకు అంత కోపం?" శశి చిరుకోపంతో ముద్దుగా అడిగింది.

ఏం నీ అన్నయ్య అడగమన్నాడా?" అరుణ ఎత్తిపొడుస్తున్నట్టు అంది. "కదిలిస్తే ఖంయ్యమంటావు, నీతో నాకెందుకులే" అంటూ మేడదిగి పోయింది చిన్నారి శశి!

ఆ రాత్రి రవీంద్రా, రాజా, అరుణ, లక్ష్మీపతిగారు భోజనం చేస్తుండగా "యివాళ వంటంతా లతచేసింది" అంది సావిత్రమ్మ "లతా, వంట చాలా బాగా చేశావమ్మా!" అన్నారు లక్ష్మీపతిగారు, రాజా చిరునవ్వుతో లతని చూచాడు. అరుణకి వుక్రోషం ముంచుకవచ్చింది. తనకు వంటచేతకాదని హేళన చేస్తున్నారనుకుని తినే, అన్నం విసిరికొట్టింది. భోజనం నచ్చలేదంటూ విసుక్కుంటూ వెళ్ళిపోయింది.

అన్నం తినలేదని, అరుణకి ఓ గ్లాసు పాలు యిచ్చి రమ్మని లతని పంపారు సావిత్రమ్మ, లత పాలు తీసుకువెళ్ళింది. నీ నక్క వినయాలు నా దగ్గర కాదంటూ, ఆ గ్లాసు విసిరికొట్టింది, లత ముఖం చిన్నబోయింది,

"నేనేం తప్పు చేశానని, ఈ అరుణ"కి నా మీద యింత కోపం" అనుకుంటూ వెళ్ళిపోయింది లత.

మర్నాడు రాజా ఫ్రెండ్ శ్రీధర్ ఆగ్రా నుండి వచ్చాడు. శ్రీధర్, రాజా, కాలేజీ, స్నేహితులు అసలు శ్రీధర్‌ది హైదరాబాద్. ఇప్పుడు "ఆగ్రా"లో వుంటున్నాడు. అప్పుడప్పుడు రాజాని చూడటానికి వచ్చి సరదాగా ఒక నెల రోజులు, వుండి వెళుతుంటాడు. శ్రీధర్ రాగానే, లక్ష్మీపతిగారు, సావిత్రమ్మగారు పలకరించారు ఎంతో ఆప్యాయంగా, శ్రీధర్ అంటే ఆ ఇంట్లో అందరికీ అభిమానం!

శ్రీధర్ తల్లిదండ్రులు చిన్నతనంలోనే పోవడంతో ఒంటరివా డయ్యాడు రాజా స్నేహం అతడి వంటరితనం పోగొట్టింది. అందుకే రాజాని సొంత తమ్ముడిలా, శశిని సొంత చెల్లెలుగా చూస్తాడు. అతడు శశికి మంచి మంచి బొమ్మలు, పుస్తకాలు, స్వీట్సు తీసుకువచ్చాడు.

"శశీ! ఇవాళ స్కూలుకి వెళ్ళలేదా?" శ్రీధర్ అడిగాడు.

"ఊహూఁ .... వెళ్ళలేదు. ఇవాళ ఇంగ్లీషు పాఠం రాయమన్నారు మా టీచర్. రోజూ లత రాసి యిచ్చేది, నేను ఆడుకుంటుంటే. నిన్న లతకి జ్వరం వచ్చిందికదూ! అందుకు నేను స్కూలుకి వెళ్ళలేదు. మా టీచర్‌కి ఫోన్ చేశాను. 'సారీ టీచర్! నేను యివాళ స్కూలుకి రాను, లతకి జ్వరం' అంటూ." శశి చేతులు తిప్పుతూ కళ్ళు తిప్పుతూ చెబుతూంటే అందరూ ఘొల్లున నవ్వారు.

"లత ఎవరూ?" శ్రీధర్ అడిగాడు.

లతని గురించి రాజా చెప్పగా విని బాధపడ్డాడు శ్రీధర్.

ఆ రోజు భోజనాలు చేస్తుండగా, లతని చూచాడు శ్రీధర్ ఎంత చక్కని అమ్మాయి అనుకున్నాడు. లతని పరిచయం చేశాడు శ్రీధర్‌కి రాజా. లత వినయంగా నమస్కరించింది. ఆ అమ్మాయి సంస్కారానికి ముగ్ధుడైనాడు శ్రీధర్.

ఆ రోజంతా "చెస్" ఆటతోనూ, కబుర్లతోనూ గడిపారు వాళ్ళు. స్నేహితులిద్దరూ, ఆ సాయంత్రం షికారుగా చల్లగాలి కోసం తోటలోకి వెళ్ళారు తోటలో, మల్లెపొదల దాపున చెక్కిట చెయ్యి జేర్చుకొని ఆలోచిస్తూ కూర్చున్న లతని చూశారు ఇద్దరూ, లైట్ బ్లూ దుస్తుల్లో, అలసిపోయినముఖంతో గాలికి ముఖంమీద పడుతున్న ముంగురులతో ఎంతో అందంగా వుంది రాజా తన కెమేరాతో లతని ఆ పోజ్‌లో "క్లిక్" చేశాడు శ్రీధర్ సంగతంతా కనిపెట్టేసినట్లు నవ్వాడు రాజాకూడా నవ్వేశాడు.

వాళ్ళ నవ్వులకి గబుక్కున తలెత్తి చూచిన లత, సిగ్గుతో లేచి గబ గబా వెళ్ళిపోయింది. బుజాలు ఎగరేస్తూ అబ్బో! అంటూ నవ్వాడు రాజా....

రాజా ఫ్రెండ్ వస్తాడని తెలిసి కూడా, రవీంద్ర అరుణలు ఆ రోజు, మరో నలుగురు కొత్త ఫ్రెండ్స్‌తో పిక్నిక్ వెళ్ళారు. అర్ధరాత్రి ఒంటి గంటకు కారులో తిరిగి వచ్చారు అంతరాత్రి దాకా మేల్కొని, లత వాళ్ళకి "హార్లిక్స్" కలిపి యిచ్చింది.

మర్నాడు తొమ్మిది గంటలకి నిద్ర లేచింది అరుణ అందంగా అలంకరించుకుంది, రాజాకి పిక్నిక్ విషయాలు చెప్పాలనుకుంటూ, ఉత్సాహంగా రాజా "రూమ్"కి దారి తీసింది, తలుపులు దగ్గరగా వేసి వున్నాయి.

"రాజ్! మే ఐ కమిన్ ప్లీజ్" అంటూ నిలబడిపోయింది,

"ఎస్! అని రాజా అనగానే" తలుపు నెట్టుకొని లోపలికి అడుగు పెట్టిన అరుణ శ్రీధర్‌ని చూచి కెవ్వుమని కేక పెట్టింది.

శ్రీధర్ అరుణనిచూచి ఎగతాళిగానవ్వాడు,

అరుణ అక్కడ నుంచి పరుగు తీసింది అది చూచి రాజాకి ఆశ్చర్యమేసింది. శ్రీధర్

(మిగతా 38 వ పేజీలో)

## బుల్లి బుల్లి యిసిత్రాలు

-రంధి సోమరాజు


పాలికాపోడ్ని తోడుచ్చుకోని
సవారి బండెక్కి నురక త్తినా వొచ్చి
సర్ సరీన రైలు నుక్కినా యెక్కి
రివు రివ్వున పట్టనాన రిక్సాలో సేరి
యేగం యేగం సినేమాకాడి కెల్లు ఎల్లు
అంది.
కల్లు తిప్పి తిప్పి సూసి కొవ్వారు పాప
ఎంటొచ్చినో డింక
బండెనకాల, కాల్లీడ్సుగుంటు
పరుగులెత్తాల్లోరి దేముడోయ్ అనుకొని
సిక్కిరి బిక్కిరి సూపులు సూత్తావుంటే
ఈడ కూకో ఈడ కూకో అంటూ
కుసింత కాలకాడ కూకోడాకి సోటిచ్చి
దేవత్నా నిబ్బరంగ నిలువెత్తు నెలిగి
పోనాది
అదేటో ఈదిలోని పనిలేని పిల్లి
మంగలోలు
ఆ బుల్లి కాలకాడ సచ్చినోడేపు సూసి
ఈ గడ్డకింక పెజా సామియం రాదెహె
అన్నట్టు కూకున్నాడ్రొరే అన్కొని
మల్లీ ఆ జులాయోలె
అదేటో వుడికుడికి సచ్చినారు
వుడుకు నవ్వులు నవ్వినారు
పాలికాపోలమైనా బాగున్ను
ఆ పాదాలకాడ యెచ్చగా కూకుందుం
అనుకోని
అటే సూత్తా కొయ్యముక్కలై పోనారు.

సరిగ్గా యిదే చీర నా ముందు వేశారు. దాన్ని చూడగానే నాకు డోకు వచ్చేసిందనుకో. "ఛీ! ఛీ: ఇదేమిటీ ఈ వెధవ చీర? ఇదీ ఒక చీరేనా?" అని విసిరేశాను." దర్పంగా చెబుతూ నావైపు తిరిగి అంది.

"అదీసరే గానీండి! మీరెలా తీసుకున్నారండీ యిది? ఏది ఏమైనా మీ టేస్టు మాత్రం నాకు సుతరామూ నచ్చలేదు సుమండీ!" అంది పనిలేకున్నా పగలబడి నవ్వుతూ. చెప్పొద్దూ! నాకు మహా మండిపోయింది ఒళ్ళు. ఆ చీర మా శ్రీవారు మనసుపడి నా బర్త్‌డేకి ఎంతో మురిపెంగా తెచ్చి ప్రెజెంట్ చేశారు. ఆ చీర ఈవిడ గారికి "వె ధ వ చీ ర ట!" కోపంగా, వ్యంగ్యంగా నేనూఅన్నాను..

"అవును సుమండీ! ఒకరి టేస్టు మరొకరికి ఎలా నచ్చుతుంది? నిజమే అన్నారు. కాని మీరు యిలా భలేగా మాట్లాడేస్తున్నాను అనుకుంటూ తెగ వాగేస్తున్నారు చూడండి, అది మీకు నచ్చిందేమో గాని, నాకు మాత్రం చెవుల్లో సీసం కరిగించిపోస్తున్నంత అద్భుతంగా వుంది" అనేసి లేచి నిలబడ్డాను. ఆ అమ్మాయిమొహం చెల్లని దమ్మిడీకాసులాగా చిన్నబోయింది. "వస్తానత్తయ్యా!" అని అత్తయ్యకి చెప్పి వచ్చేశాను. చూడండీ ఇలా మొహంమీదమాటలనే అలవాటు ఎదుటివాళ్ళని ఎంత నొప్పిస్తుంది అనే విషయాన్ని మర్చిపోయి మాట్లాడేస్తే ఏం బాగుంటుంది చెప్పండి?

అందుకే అంటున్నాను. ఎన్ని అలవాట్లు వున్నప్పటికీ కనీసం ఎవరైనా వచ్చినపుడు గాని, ఎవరింటికైనా వెళ్ళినపుడుగాని పదే పదే "నా కిదంటే అసహ్యం. అబ్బే ఛండాలం" అని అనెయ్యకుండా ఎలాగోలాగ వెళ్ళినపుడు ఆ యింటివాళ్ళు ఎంత మర్యాద ఇచ్చారో, తిరిగి ఆ యింటినుంచి వచ్చేటపుడు అంతే మర్యాదతో బయటకువచ్చేస్తే మనకూ ఆనందంగా వుంటుంది. ఆ యింటి వాళ్ళకీ ఆనందంగా వుంటుంది. అదీకాక యింటికి ఎవరైనా వచ్చి వెళ్తే "మళ్ళీ వస్తే బాగుంటుంది, మంచి మనిషి" అని అనిపిస్తే బాగుంటుందో, లేకపోతే "అబ్బే, ఒరి జిడ్డు మనిషి. చెప్పిందే చెబుతూ ఏమిటో ఆ అర్థంలేని మాటలు? తమ యింట్లో ఎంత డాబూ,దర్పం ఒలకబోస్తేమాత్రం, పరాయి యింట్లో కాస్త సర్దుకు పోలేరా? ఇలాటి వాళ్ళు వచ్చి, మనల్ని చిన్నబుచ్చటం దేనికని?" అని అనిపిస్తే బాగుంటుందో బాగా ఆలోచించి మీరే చెప్పండి?



# అందకారంలో ఆశాకిరణం

[14 వ పేజీ తరువాయి]

ముఖంలోకిచూస్తూ "అరుణ నీకు తెలుసా?" అనడిగాడు రాజా.

"తెలుసు"ముక్తసరిగా అన్నాడు శ్రీధర్. రాజా మరింకేమీ మాట్లాడలేదు.

అరుణ రవి దగ్గరకు వచ్చి పడింది.

"రవీ! ఆ శ్రీధర్ వచ్చాడు. మనకొంప మునిగింది.

అదివిని అదిరిపోయి చదువుతున్న నవల విసిరికొట్టాడు రవి.

"శ్రీధర్ వచ్చాడు రాజాకి నా గురించి చెప్పేశాడంటే నా బ్రతుకు ఏం కావాలి?" అంటూ ఏడ్చింది అరుణ.

"అరుణా! అదంతా నేను చూసుకుంటాను. ధైర్యంగా వుండు పిచ్చిపిల్లా! ఎందుకేడుస్తావు!" అని చెల్లెల్ని ఓదార్చాడు రవి.

"అరుణా! నేను గొప్ప ప్లాను వేశాను గానీ,ఈ రోజునుంచీ లతతో నీవు మంచిగా వుండు. రాజా మనకి దగ్గర కావాలంటే అదే మార్గం. నీ సంగతి రాజాకి శ్రీధర్ చెప్పకుండానేను కనిపెట్టే వుంటాను ఏమంటావు?" అన్నాడు రవీంద్ర. మౌనంగా తలూపింది అరుణ

తోటలో అరుణ ఏవేవో కబుర్లు చెబుతున్నది, లత వింటూ కూర్చుంది అమాయకంగా నవ్వుతూ ఆ దృశ్యం రాజాకి వింతగా తోచింది. అక్కడికి రాజా, శ్రీధర్‌లు రావటంచూచి, ఇద్దరూ లేచి వెళ్ళిపోయారు.

అరుణ హడలిపోయింది.

"మా రాక మీకు ఎలాంటి అంతరాయ కలిగించలేదు కదా?" అడిగాడు రాజా.

"అబ్బే! అంతరాయం ఏముంది? ఏమితోచక యిట్లా వచ్చాము రా లతా! ఇక్కడ ఎందుకు మనం" అంటూ తన తత్తర పాటును కప్పిపుచ్చుకుంటూ గబగబా లత చెయ్యి పట్టుకొని వెళ్ళిపోయింది.

రాజా, శ్రీధర్‌లు ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నారు. శ్రీధర్ ఆలోచిస్తూ నిలబడి పోయాడు

"శ్రీధర్! అరుణని చూచినప్పటినుంచి నీవేదో బాధపడుతున్నట్లున్నావు స్నేహితుడిగా నాకేమి తెలియకూడదా?" రాజా అడిగాడు.

"రాజా! నీ కన్నా నాకు ఆప్తులు ఎవరున్నారు! తప్పక చెబుతాను విను."

"అరుణా, నేనూ ఒకనాటి స్నేహితులం. అరుణ నన్ను ప్రేమించింది తన శరీరం అర్పించింది. కానీ, డబ్బులేని నన్ను పెళ్ళాడటానికి ఒప్పుకోలేదు. మరొకర్ని పెళ్ళాడటానికి సిద్ధమైంది అరుణ.

[సశేషం]

# వైద్య సలహాలు

– డా॥ జొన్నలగడ్డ వీరాస్వామి

ప్ర: బి. శ్రీరాములు, మౌలాలి మా అమ్మకు 15 ఏళ్ళుగా గుండెదడ, ఆయాసము, అరికాళ్ళ మంటలు, తేపులు, మొద్దుబారటం.

జ: పైవాటిని బట్టి మీ అమ్మకు "బెరి - బెరి" అనే జబ్బు వున్నట్లు తోస్తుంది. విటమిన్. $B_1$ (థయామిన్ క్లోరైడ్) లోపమై యుండాలి.

ఉస్మానియా ఆస్పత్రిలో వైద్యనిపుణుని చూడండి. తగ్గిపోతుంది.

ప్ర: భవాని ప్రసాద్, హిందూపూర్.
నేను నరముల బలహీనతవల్ల బాధ పడుచున్నాను. దానికి ఎం చేయాలి?

నరముల బలహీనత అంటె ఏమిటో, చెప్పండి? నేను మందులు చెప్తాను.

ప్ర: ఎస్. ఎల్. కుమారి, మంగళగిరి. నాకు మొదటి కాన్పులో ఒకమ్మాయి పుట్టింది ఆ పాపకు 3 నెలల వరకు పాలు సరిపోయి బాగానే ఉంది. 4 వనెల రాగానే కుడి రొమ్ములో పాలు త్రాగుట మానేసింది ... ....

జ: దానివలన ఆందోళనచెంద నవసరం లేదు పాలు సరిగ్గా పడటం లేదు మీరు మంచి ఆహారం, అంటె పాలు, పెరుగు, పప్పు దినుసులు మొదలగునవి పుష్కలంగా తీసుకోవాలి. అప్పుడు పాలు సరిపోతాయి.

మన దేశంలో బాలింతను. ఒక రోగిగా చూస్తారు. బాలింత రోగి కాదు. బాలింత తన శరీరపు పోషణ, తన బిడ్డ శరీర పోషణ చూడాలి. అందుకని ఆహారం బాగా తీసుకోవాలి

మొదట్లో బాలింతను మాడపెడతారు కారం పెట్టి, పత్యం ఇస్తారు. దానివలన పోషణ తగ్గి, పాలు సరిగ్గా పడవు. దాదాపు 60 చుక్కల రక్తం ప్రవహించాలి ఒక చుక్క పాలు అగుటకు. మీరు అమ్మమ్మ కబుర్లు వినకండి.

పాలు తగ్గితే పోతపాలు పట్టండి.